క్లుప్తంగా

నేడు టంగుటూరి ప్రకాశం జయంతి

కాకినాడ సిటీ: దివంగత టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఈ నెల 23న ఉదయం 9 గంటలకు కాకినాడ జెడ్పీ సెంటర్‌లో ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తామని కలెక్టర్ షణ్మోహన్ సగిలి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు.. ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం, సభా కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

కరప: మెగాస్టార్ చిరంజీవి 69వ జన్మదిన వేడుకలు స్థానిక దుర్గాదేవి ఆలయం వద్ద గురువారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది పంచాయతీ కార్మికులు, పేదలకు బియ్యం, కాయగూరలు, కిరాణా సామగ్రి కిట్లను అందజేశారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, వైద్య నిపుణుడు బొండా సూర్యారావు, వైఎస్సార్ సీపీ నాయకులు సాదే లోహిదాస్, నక్కా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్: సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు స్థానిక భానుగుడి సెంటర్‌లో నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి చిట్ల కిరణ్ ఆధ్వర్యంలో 250 మందికి అన్నదానం చేశారు.

సీఐ సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



త్రీ టౌన్ సీఐగా బాధ్యతలు చేపడుతున్న సత్యనారాయణ

కాకినాడ క్రైం: కాకినాడ త్రీ టౌన్ సీఐగా కడలి వెంకట సూర్య సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. 2009 ఎస్సై బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్సైగా కాకినాడ టూ టౌన్, తిమ్మాపురం, ఉప్పాడ కొత్తపల్లి, సర్పవరం పీఎస్‌ల్లో పనిచేశారు. 2021లో సీఐగా పదోన్నతి పొంది, కాకినాడ సీసీఎస్, ఎస్‌బీ, కుక్కునూరుల్లో పని చేశారు. రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ సీఐగా కొనసాగుతున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ త్రీ టౌన్‌కు వచ్చారు. గురువారం బాధ్యతలు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: కొద్ది రోజుల క్రితం విద్యుదాఘాతానికి గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక గాంధీనగర్‌కు చెందిన 32 ఏళ్ల పి.నాగేంద్రకుమార్ విద్యుదాఘాతానికి గురై, ఈ నెల 11న కాకినాడ జీజీహెచ్‌లో చేరాడు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి..

కాకినాడ జీజీహెచ్ ఆవరణలో ఉంటూ, కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సుమారు 60 ఏళ్ల వయసున్న అతడికి సంబంధించిన వారెవరూ లేరు. ఎం3 వార్డులో అనారోగ్యంతో చికిత్స పొందుతూ చనిపోయాడు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పిఠాపురం గ్రామీణ మండలం వీరవరం గ్రామానికి చెందిన వెలుగుల బలరాం(35) పురుగు మందు తాగి, స్థానిక వైద్యుల సిఫార్సు మేరకు ఈ నెల 21న కాకినాడ జీజీహెచ్‌లో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనకు కారణాలు తెలియరాలేదు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్క్వాష్.. కోర్టు మటాష్..!

- డీఎస్‌ఏలో నిర్లక్ష్యం
- విరిగిపోయిన ప్రధాన గేటు
- మూలకు చేరిన సీలింగ్ లైట్ల డూమ్‌లు
- ప్రమాదకరంగా ఫ్యూజు బాక్సు
- శిక్షణకు అవరోధాలు.. క్రీడాకారుల్లో నెలకొన్న నిరాశ



డీఎస్ఏ స్క్వాష్ కోర్టు ముందు నిలిచిన వర్షపు నీరు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): అంతర్జాతీయంగా సంపన్న వర్గాల క్రీడగా పేరొందిన స్క్వాష్ క్రీడ ఇండోర్ కోర్టు అసౌకర్యాల నిలయంగా మారింది. ఏపీ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) లో స్క్వాష్ కోర్టును నెలకొల్పారు. దాని నిర్వహణను గాలికొదిలేయడంతో చిన్నపాటి వర్షానికే స్క్వాష్ కోర్టు ప్రాంగణం నీటితో నిండిపోతోంది. స్క్వాష్‌లో రాణిస్తే విద్య, ఉద్యోగ అవకాశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నాయి.

గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా వ్యవహరించిన కార్తికేయ మిశ్రా చొరవతో 2018లో రూ.25 లక్షలతో స్మార్ట్ సిటీ నిధులతో కాకినాడ డీఎస్ఏలో స్క్వాష్ కోర్టును ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్యం ఉదయం 6 నుంచి 8 వరకు, సాయంత్రం 4 నుంచి 7 వరకు పే అండ్ ప్లే విధానంలో శిక్షణ అందిస్తున్నారు. పెద్దలు 5, చిన్నారులు 8 మంది శిక్షణ పొందుతున్నారు. నెలకు పిల్లలకు రూ.500, పెద్దలకు రూ.వెయ్యి రుసుము వసూలు చేస్తున్నారు. గత ఏడాది స్కూల్ గేమ్ నేషనల్స్‌లో 18 మంది పాల్గొన్నారు. ఢిల్లీ ర్యాంకింగ్ టోర్నీలో ప్రణవ్, కార్తికేయ పాల్గొన్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో ర్యాంకింగ్ టోర్నీలు జరగనున్నాయి. ఆరుగురు క్రీడాకారులు తర్ఫీదు పొందుతున్నారు.



వైర్లు బయటకు వచ్చి ప్రమాదభరితంగా ఫ్యూజ్ బాక్స్, సీలింగ్ లైట్ల డూమ్‌ల దుస్థితి



మూలకు చేరిన కోర్టు ప్రధాన రోలింగ్ డోర్

సమస్యలు కోకొల్లలు

గతేడాది షార్ట్‌సర్క్యూట్ కావడంతో కోర్టు లోపల ఏసీ, వైరింగ్, లైట్లు కాలిపోయాయి. ప్రస్తుతం స్క్వాష్ కోర్టు ప్రధాన ద్వారం విరిగిపోయి మూలకు చేరింది. కోర్టులో లైట్లు బాగు చేసినా, డూమ్‌లు అమర్చకపోవడంతో లైటింగ్ సరిగా రావడం లేదని క్రీడాకారులు వాపోతున్నారు. స్క్వాష్ కోర్టు కరెంటు అందించే ఫ్యూజు బాక్సు వైర్లు బయటికి వచ్చి ప్రమాదభరితంగా మారాయి.

వినతిపత్రం సమర్పించాం



స్క్వాష్ కోర్టులో సౌకర్యాలు కల్పించాలని డీఎస్‌డీఓకు ఇప్పటికే వినతి పత్రం సమర్పించాం. సౌకర్యాల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు కాగానే, కోర్టుకు కావల్సిన మరమ్మతులు పూర్తి చేస్తామని డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ చెప్పారు.

– లక్ష్మణ్, స్క్వాష్ కోచ్, డీఎస్ఏ

అన్ని పనులు పూర్తి చేస్తాం



ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం నాటికి డీఎస్ఏలో చేపట్టాల్సిన అన్ని పనులు పూర్తి చేస్తాం. ఇప్పటికే కలెక్టర్‌కు నివేదిక సమర్పించాం. కలెక్టర్ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తామన్నారు. స్క్వాష్ కోర్టు డోర్ ఆర్డర్ పెట్టాం. మూడు, నాలుగు రోజుల్లో డోర్ ఏర్పాటు చేస్తాం. వర్షం నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకుంటాం.

– బి.శ్రీనివాస్‌కుమార్, డీఎస్‌డీఓ

ఆదాయం సమకూరుతున్నా..

స్క్వాష్ కోర్టు ద్వారా పే అండ్ ప్లే విధానంలో ప్రతి నెలా డీఎస్ఏకు ఆదాయం వస్తున్నా, అధికారులు కోర్టులో సౌకర్యాలు కల్పించడానికి ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ నుంచి పాఠశాల క్రీడా సమాఖ్య, సంఘ పోటీలు ప్రారంభం కానున్నాయి. క్రీడాభివృద్ధి అధికారులు ఇప్పటికైనా స్పందించి స్క్వాష్ కోర్టులో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని, కోర్టు ముందు నీరు నిల్వ ఉండకుండా చూడాలని క్రీడా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ఘనంగా చతుర్థి మాసోత్సవం



గణేశ సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: హేరంబ సంకష్ట హర చతుర్థి సందర్భంగా భోగి గణపతి పీఠంలో గురువారం ఉదయం సుప్రభాత వేళలో చతుర్థి ఉపవాసకులు నగర సంకీర్తన నిర్వహించారు. నాలుగు అడుగుల మూషిక వాహన గణపతి విగ్రహాన్ని సన్నాయి మంగళ వాయిద్యాల నడుమ గణేశ సంకీర్తన చేస్తూ ఊరేగించారు. బత్తాయి పండ్లతో పాల వెల్లిని ప్రత్యేకంగా అలంకరించి, కలశ స్థాపన, సహస్రనామ పారాయణ, అఖండ హారతి అందించారు. పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ పీఠంలో సెప్టెంబర్ 7 నుంచి జరిగే 41వ నవరాత్రి ఉత్సవాల్లో అష్ట గణపతుల ఊరేగింపు వేడుక జరుగుతుందన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలు, ఏడుగురికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను గురువారం కోర్టులో హాజరు పర్చగా, ఇద్దరికి రెండు రోజుల వంతున జైలు, ఏడుగురికి రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ప్రజాభిప్రాయం మేరకే నిర్ణయం

- విలీన గ్రామాలపై రూరల్ ఎమ్మెల్యే నానాజీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

కాకినాడ రూరల్: కాకినాడ కార్పొరేషన్‌లో విలీన ప్రతిపాదిత గ్రామాలపై ప్రజల అభిప్రాయం మేరకు తాము నిర్ణయం తీసుకుంటామని రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ వెల్లడించారు. వలసపాకల గ్రామం గంగరాజునగర్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం మెరుగయ్యేందుకు నిధులు అవసరమన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి, విలీనంపై ప్రజల అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. శుక్రవారం జరగనున్న ఉపాధి గ్రామ సభలు విజయం చేయాలని, పార్టీలకు అతీతంగా హాజరవ్వాలని కోరారు. కాకినాడ పోర్టు నుంచి బియ్యం అక్రమ రవాణాలో నిందితులను విడిచి పెట్టబోమన్నారు. కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల రాసిన లేఖపై ఆయన స్పందించి, పలు ఆరోపణలు చేశారు.

పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటాలి

డాక్టర్ ఉమర్ ఆలీషా



మొక్కలు నాటుతున్న డాక్టర్ ఉమర్ ఆలీషా తదితరులు

పిఠాపురం: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లు నాటి, వాటిని పరిరక్షించాలని శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక విద్యా పీఠం చైర్మన్ డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి డాక్టర్ ఉమర్ ఆలీషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఒక్కొక్క మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ముందుగా డాక్టర్ ఉమర్ ఆలీషా మొక్కలు నాటగా, అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, అధ్యాపకులు ఎం.సుందరయ్య, డాక్టర్ కే.శారద, డాక్టర్ ఎం.రామారావు, ఉదయ భాస్కర్, లైబ్రేరియన్ ఎండీ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ పీఓలు డీవీ కాశీవిశ్వనాథం, వి.బుల్లి ప్రసాద్ తదితరులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఏవీవీ సత్యనారాయణ, రేఖా ప్రకాష్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సకాలంలో స్పందించండి

- కార్పొరేషన్ కమిషనర్ భావన



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: మీ కోసం-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే ఫిర్యాదులను నిశితంగా పరిశీలించడంతో పాటు, వాటి పరిష్కారానికి సకాలంలో స్పందించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. ప్రజా పరిష్కార ఫిర్యాదులపై గురువారం కమిషనర్ నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే వినతులను స్వీయ పరిశీలన అనంతరం మాత్రమే క్లోజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. తప్పనిసరిగా గడువులోగా స్పష్టమైన వివరణ అర్జీదారునికి అందించి, వీలైనంతగా సంతృప్తి స్థాయిని పెంపొందించాలని వివరించారు. ప్రజా ఫిర్యాదులను కమ్యూనిటీ, ఫైనాన్స్, నాన్ ఫైనాన్స్ ఫిర్యాదులుగా వర్గీకరించి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని కోరారు.

ఫ్లెక్సీపై మా ఫొటో ఏదీ..?

- ఎంపీడీఓను నిలదీసిన సర్పంచులు
- ఎట్టకేలకు ఫొటో పెట్టాలంటూ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశం



ఎంపీడీఓ అప్పారావుతో గ్రామసభల ఫ్లెక్సీ విషయమై చర్చిస్తున్న వివిధ గ్రామాల సర్పంచ్‌లు

కరప: గ్రామసభల ఫ్లెక్సీపై సర్పంచుల ఫొటో ముద్రించే వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది. ఫొటో ముద్రించాల్సిందేనని, లేకపోతే గ్రామసభలకు వచ్చేది లేదంటూ సర్పంచులు మొరాయించడంతో.. చేసేది లేక తుదకు ఫొటో ముద్రణకు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలివ్వాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల పరిధిలో గ్రామసభలు నిర్వహించి, కార్యాచరణ ప్రణాళిక, ఉపాధి హామీ పథకంలో పనుల గుర్తింపు, ఇతర అంశాలపై ప్రజల సమక్షంలో తీర్మానాలు చేయించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీనికి సంబంధించి గ్రామసభలు నిర్వహించేటప్పుడు ఏర్పాటుచేసే ఫ్లెక్సీలో సీఎం, డిప్యూటీ సీఎం, ఎంపీ, ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీ ఫొటోలు ఉండేలా ముద్రించాలని ఎంపీడీఓ కె.అప్పారావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామసభలకు అధ్యక్షత వహించి, నిర్వహించి, ఖర్చు భరించే సర్పంచ్‌ల ఫొటో ఫ్లెక్సీపై లేకపోవడం ఏమిటని పలువురు సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కరపలో గురువారం ఎంపీడీఓ అప్పారావును మండలానికి చెందిన సర్పంచ్‌లు కలిసి, ఫ్లెక్సీలో తమ ఫొటో వేయించవద్దనడం ఏమిటని ప్రశ్నించారు. పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఫ్లెక్సీలో తప్పనిసరిగా ఉండాల్సిన ఫొటోల విషయాన్ని కార్యదర్శులకు చెప్పామని, అవసరమైతే విడిగా సర్పంచ్‌లు తమ ఫొటో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్నట్టు ఫ్లెక్సీలు పెట్టుకోవచ్చని సమాధానమిచ్చారు. దీంతో గ్రామసభ ఫ్లెక్సీలోనే సర్పంచ్ ఫొటో కూడా ఉండాలని, లేకపోతే గ్రామసభలకు సర్పంచ్‌లు హాజరయ్యేది లేదని వలసపాకల సర్పంచ్ వాసంశెట్టి రామారావు స్పష్టం చేశారు. ఎంపీడీఓ అప్పారావు స్పందించి, సర్పంచ్ ఫొటో కూడా గ్రామ సభ ఫ్లెక్సీలో పెట్టిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- జీజీహెచ్‌లో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి
- సూపరింటెండెంట్‌కు కార్పొరేషన్ కమిషనర్ భావన ఆదేశం

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో వైద్య విద్యార్థినులు, మహిళా రోగులు, వైద్యుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ రక్షణ చర్యలు చేపట్టాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ లావణ్యకుమారి, ఇతర వైద్యాధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. మహిళల రక్షణకు సీనియర్ వైద్యులు, వైద్యాధికారిణులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భద్రతా పరిస్థితులపై కమిషనర్ భావన గురువారం రాత్రి ఆకస్మిత తనిఖీ చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్య కుమారితో కలిసి కమిషనర్ జీజీహెచ్ ఆవరణను పరిశీలించారు. నర్సింగ్ హాస్టల్, అలాగే తల్లి, పిల్లల వార్డులను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ అధికారులకు కమిషనర్ పలు సూచనలు చేశారు. తల్లీపిల్లల వార్డులో రోగుల పరిస్థితిపై కమిషనర్ ఆరా తీశారు. చిన్నపిల్లల వార్డులో చికిత్స పొందుతున్న పిల్లల ఆరోగ్యంపై అక్కడున్న వైద్యులతో మాట్లాడారు. అలాగే తల్లీపిల్లల వార్డు వెనుక ఉన్న జూనియర్ డాక్టర్ల హాస్టల్ను కమిషనర్ పరిశీలించి, అక్కడున్న పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ భావన ఆస్పత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. నర్సింగ్ హాస్టల్ ఆవరణను శుభ్రపర్చాలని ఆదేశించారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో అంధకారం లేకుండా స్ట్రీట్ లైట్లన్నీ వెలిగేలా చూడాలన్నారు. సెక్యూరిటీ సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ఆమె వెంట ఎంహెచ్ఓ పృథ్వీచరణ్, ఈఈ మాధవి, ఇతర అధికారులు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీవిద్య



సామర్లకోట: కొత్త మున్సిపల్ కమిషనర్‌గా ఏ శ్రీవిద్య నియమితులయ్యారు. ఇప్పటి వరకు పని చేస్తున్న కమిషనర్ జె రామారావును గతంలో పని చేసిన హోదాలోనే గుంటూరు కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టరుగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. భీమవరం మున్సిపాలిటీలో శ్రీవిద్య అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తుండగా, ఆమెను ప్రభుత్వం సామర్లకోట కమిషనర్‌గా నియమించింది.

ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం

ఆర్టీసీ కాకినాడ డీఎం కుమార్

సామర్లకోట: బస్సు కాంప్లెక్స్‌కు వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక బస్సు కాంప్లెక్సును ఆయన తనిఖీ చేశారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని, అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. బస్సుల రాకపోకల అనౌన్స్‌మెంట్ సక్రమంగా ఉండాలన్నారు. బస్సుల ప్రయాణంలో జాప్యం ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని, ఆయా డిపోల అధికారులతో మాట్లాడతామని స్థానిక కంట్రోలర్ వజ్రానికి తెలిపారు. కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు ఫ్యాన్లు, లైట్ల సదుపాయం సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. బస్సుల రద్దీపై సమాచారం ఇస్తే, ఆయా రూట్లలో అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. బస్సు కాంప్లెక్స్‌లో నిర్మాణంలో ఉన్న షాపులను ఆయన పరిశీలించారు.

నేడు పంచారామ క్షేత్రంలో సామూహిక వ్రతాలు

సామర్లకోట: శ్రావణ మాసం సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మూడో శుక్రవారంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్టు ఈఓ భళ్ల నీలకంఠం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్రతాలకు కావలసిన తోరాలు, రూపులు, ఆకులు, చెక్కలు, కొబ్బరి కాయలు, అరటి పండ్లు, గాజులు, ప్లేట్లు, పువ్వులు, లక్ష్మీదేవి ఫొటోను దాతలు సమకూరుస్తారన్నారు. వరలక్ష్మి వ్రతాలకు వచ్చే మహిళలు కేజీన్నర బియ్యం, కలశ చెంబు, బ్లౌజ్ మాత్రమే తీసుకురావలసి ఉంటుందన్నారు. వ్రతాలు నిర్వహించే పురోహితులకు దేవస్థానం నుంచి రుసుము చెల్లిస్తారని తెలిపారు. వ్రతాలకు హాజరయ్యే వారు తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వీరు ప్రతి శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయంలో నిర్వహించే సామూహిక వ్రతాలకు హాజరు కావాలన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేస్తారన్నారు.

వరుణుడి కరుణ

- ఎండ వేడిమితో అల్లాడుతున్న జనానికి ఉపశమనం
- మూడు వారాలుగా తప్పని ఇబ్బందులు
- పంటలకూ మేలు చేసిన వర్షం
- ఉరుములు, మెరుపుల వానతో పల్లపు ప్రాంతాలు జలమయం



కరపలో జోరుగా కురుస్తున్న వర్షం

కరప: వేసవిని మించిన ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజానీకం గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో సేదతీరారు. మూడు వారాలుగా భానుడు ప్రతాపం చూపుతుండటంతో, ఉష్ణతాపానికి జనం విలవిల్లాడారు. వరుణదేవుడి కరుణ కోసం ఎదురు చూస్తున్న రైతాంగానికి గురువారం మధ్యాహ్నం 11 గంటలకు ఆకాశం మబ్బులు పట్టి, ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. తర్వాత దిక్కులు పిక్కటిల్లేలా ఉరుములు, మెరుపులతో గంటన్నర పాటు భారీ వర్షం పడింది. వర్షానికి పల్లపు ప్రాంతాలు, రహదారులు, పాఠశాలలు, మండల పరిషత్ కార్యాలయం జలమయమయ్యాయి. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్నిచోట్ల మోకాలు లోతు నీరు నిలిచిపోయింది. వాహనాలు సగం వరకు నీట మునిగాయి.



వలసపాకలలో నీరందక, వర్షాల్లేక బీటలు వారిన పొలం

వ్యవసాయానికి మేలు

జూలైలో కురిసిన వర్షాలకు అనేక ఎకరాల్లో తొలకరి నాట్లు ముంపునకు గురయ్యాయి. దీంతో మళ్లీ వరి నాట్లు వేయాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు. దాదాపు మూడు వారాలుగా కాస్తున్న ఎండలకు సాగు నీరందక, పంటలు ఆరిపోయి, నెరలు తీశాయి. కాలువలకు నీరు సమృద్ధిగా వదులుతున్నట్టు ఇరిగేషన్ అధికారులు చెప్పడమే కానీ, శివారు భూములకు, మెరక భూములకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నెరలు తీసిన పొలాలు

సంపరబోది, న్యూ భీమన్నకర్ర కాలువ, గరువు కాలువలకు పూర్తి స్థాయిలో సాగు నీరందక శివారు భూములు నెరలు తీశాయి. వలసపాకల గ్రామంలో అయితే పొలాలు ఎండిపోయి, పరిస్థితి మరీ దారుణంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలకరి పంటపై ఆశలు వదులుకుంటున్న సమయంలో.. వర్షం కురవడంతో చాలా మేలు చేసిందని రైతులు వాసంశెట్టి ఆంజనేయులు, తలాటం వెంకట రమణ, పిల్లి నూకరాజు తెలిపారు. ఇకనుంచైనా వాతావరణం చల్లబడి, వర్షాలు పడితే పొలాలు దుబ్బు కడతాయని రైతులు నక్కా వీరభద్రరావు, పెంకే అప్పన్న తెలిపారు.

తప్పని ఇబ్బందులు

ఇలాఉండగా ఎండ తీవ్రత, వాతావరణ మార్పులతో అనేక మంది జ్వరాల బారిన పడ్డారు. ఎండ వేడి, వర్షాల తేమదనం అటూఇటుగా ఉండడంతో, వాతావరణ మార్పులను తట్టుకోలేక జనాలు కీళ్లనొప్పులు, ఇతరత్రా శారీరక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇటువంటి వాతావరణం గతంలో ఎప్పుడూ చూడలేదని వృద్ధులు అంటున్నారు.



కరప మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేరిన వర్షపు నీరు

శోకసంద్రంగా గాంధీనగర్

స్వగృహానికి నాగబాబు మృతదేహం

సామర్లకోట: ఫార్మా కంపెనీ దుర్ఘటన నేపథ్యంలో అచ్యుతాపురం నుంచి మొండి నాగబాబు మృతదేహాన్ని గురువారం రాత్రి 8.30కు పట్టణంలోని స్వగృహం ఉన్న గాంధీనగర్‌కు తరలించారు. మృతదేహాన్ని తెచ్చిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించడంతో గాంధీనగర్ ప్రాంతం శోకసంద్రంగా మారింది. బంధువులు, కుటుంబ సభ్యులు గుండెలు బాదుకుంటూ కన్నీరుమున్నీరయ్యారు. గాంధీనగర్‌లో ప్రతిఒక్కరినీ పేర్లతో ఆప్యాయంగా పలకరించే నాగబాబు ఇక లేరని తెలిసి నమ్మలేక పోతున్నామని ఆ ప్రాంత ప్రజలు కంటతడి పెట్టారు. స్థానికులు చివరి చూపుగా నాగబాబు మృతదేహాన్ని చూసి శ్రద్ధాంజలి ఘటించారు.



నాగబాబు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు